
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 43.7 : కనిష్ఠం 27.4
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శనివారం 26 ఏప్రిల్ 2025



ప్రపంచ మలేరియా వ్యతిరేక దినంపై ర్యాలీ

రాజంపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినంపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమ తెరలు వాడి దోమకాటుకు దూరంగా ఉండాలని తెలిపారు. నిల్వ నీరు ఉంచకుండా దోమల పెరుగుదలను నివారించాలన్నారు. నీటి తొట్టెలు శుభ్రం చేసి ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంగీత, సూపర్‌వైజర్ మంజూర్, గంగామణి, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, ఫార్మాసిస్ట్ పద్మ, సునీత, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో ఇంటి నిర్మాణం చేపడుతున్న దృశ్యం

మార్కింగ్ దశలోనే..
ఇందిరమ్మ ఇళ్లు!

- జిల్లాలో ఊపందుకోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- 374 ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి ముగ్గు పోశారు
- 60 ఇళ్లు పునాదుల స్థాయిలోనే..
- పైలెట్‌గా 22 జీపీల్లో నమూనా ఇళ్లు
- మొదటి విడత కింద 1,719 ఇళ్ల మంజూరు
- అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల కోసం సర్వే
- 61 మందితో ఈ నెలాఖరు వరకు పూర్తి చేయనున్న సర్వే

కామారెడ్డి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులు జిల్లాలో ఊపందుకోవడం లేదు. నిర్మాణ పనులు ప్రారంభించి దాదాపు నెల రోజులు కావస్తున్నా ఇంకా మార్కింగ్ దశలోనే ఉన్నాయి. పథకం ప్రారంభించి రోజులు గడుస్తున్నా మంజూరైన ఇళ్లలో మూడో వంతు లబ్ధిదారులు కూడా పనులు ప్రారంభించడం లేదు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 22 గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేశారు. అయితే లబ్ధిదారులు మొదట డబ్బులు వెచ్చించి ఇళ్ల నిర్మాణం చేపడుతుంటే దశల వారిగా ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తోంది. పేద ప్రజల వద్ద ఇంటి నిర్మాణానికి నగదు సమకూరలేక నిర్మాణాలు ముందుకు సాగడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో 374 ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి ముగ్గుపోయగా ఇందులో 60 ఇళ్లు మాత్రమే పునాదుల దశలో ఉన్నాయి.

ఇందిరమ్మ ఇళ్లకు 2.45 లక్షల దరఖాస్తులు

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఆ ప్రభుత్వం హయాంలో విజయవంతంగా అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తిరిగి పునరుద్ధరించింది. ఏడాది కిందట ప్రజాపాలన గ్రామ సభల్లో అర్హులైన వారి నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,45,541 ఇందిరమ్మ ఇళ్ల కోసమై దరఖాస్తులు వచ్చాయి. కాగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ శాఖకు ఇందిరమ్మ ఇళ్ల అమలు బాధ్యతను అప్పగించి ఇది వరకే సర్వే చేయించిన విషయం తెలిసిందే. జిల్లాలో నియోజకవర్గానికి 3,500ల ఇళ్ల చొప్పున ప్రభుత్వం మొదటి విడత కింద మంజూరు చేసింది. ఈ లెక్కన కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో మొత్తం 14 వేల వరకు ఇళ్లు వచ్చే అవకాశం ఉంది. స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు విడుతల వారీగా ప్రభుత్వం మంజూరు చేయనుంది.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి ఉంచిన స్థలం

మూడు కేటగిరీలుగా ఇళ్లు

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు దరఖాస్తుదారులను మూడు కేటగిరీలుగా విభజించారు. సొంత స్థలం ఉండి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్ 1 కింద విభజించారు. వారు చూపిన స్థలాన్ని జియో ఫెన్సింగ్ చేశారు. సొంత భూమి లేని వారిని ఎల్ 2 జాబితాలో చేర్చారు. వారికి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయిస్తారు. అద్దెకు ఉన్నవారు, సొంత ఇల్లు ఉండి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్ 3 జాబితాలో చేర్చారు. ఇలా జిల్లాలో ఎల్ 1 జాబితాలో 1,03,176 దరఖాస్తు దారులు ఉండగా ఎల్ 2 జాబితాలో 52,109, ఎల్ 3 జాబితాలో 80,045 దరఖాస్తులు ఉన్నాయి.

పునాది దశలోనే 60కిపైగా ఇళ్లు

రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను ఈ ఏడాది జనవరి 26న ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా అదేరోజు గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు. జిల్లాలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎంపీడీవోలు 2,396 మందిని ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా తేల్చగా అందులో 1,719 దరఖాస్తులకు కలెక్టర్ ఆమోదించారు. ఇందులో 374 ఇళ్ల నిర్మాణానికి సంబంధిత శాఖ అధికారులు మార్కింగ్ చేసి ముగ్గు పోశారు. ఇందులో 60కి పైగా మాత్రమే ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా ప్రస్తుతం పునాదులు, పిల్లర్ల స్థాయిలో ఉన్నాయి. మరికొన్ని దరఖాస్తులను ఎంపీడీవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

నిబంధనలే ఇళ్ల నిర్మాణానికి అడ్డంకి

ఇందిరమ్మ ఇళ్లను 400 స్క్వేర్ ఫీట్ లోపు నిర్మాణం చేపట్టాలని నిబంధనలు ఉన్నాయి. అయితే కొందరు 400ల ఫీట్ల కంటే ఎక్కువ మార్కింగ్ చేసుకుంటే వారి ఇళ్లు జియో ట్యాగింగ్‌లో రిజక్ట్ అవుతున్నాయి. ఇలా పలు నిబంధనలు ఇళ్ల నిర్మాణానికి అడ్డంకిగా మారిందని క్షేత్ర స్థాయిలోని సిబ్బంది చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణ సమయంలో బేస్మిట్ వరకే పిల్లర్లు వేయాలని సూచించారు. 9 పిల్లర్లు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. కొంత మంది లబ్ధిదారులు మాత్రం పిల్లర్లను స్లాబ్ వరకు వేస్తుండగా మరి కొంత మంది బేస్మిట్ వరకే వేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం రూ.5 లక్షల సాయం మోడల్ ఇళ్లకు ఖర్చు అవుతున్న స్లాబ్ లెవల్ పెంచడం, సైజ్ పెంచిన ఎక్కువ మొత్తంలో డబ్బులు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ఒక్కో ఇంటికి అదనంగా రూ.2 నుంచి 3లక్షల వరకు వెచించాల్సి వస్తుందని లబ్ధిదారులు చెబుతున్నారు.

అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే

రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి 26న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడత కింద పైలెట్ ప్రాజెక్ట్‌లో ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లాలో 22 గ్రామాల పరిధిలోని పైలెట్ ప్రాజెక్ట్ కింద 1,719 మంది లబ్ధిదారులను గుర్తించి అధికారులు ఆమోదించారు. ప్రస్తుతం ఈ ఇళ్ల నిర్మాణానికి పనులు కొనసాగుతున్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అన్ని గ్రామాల్లో అధికార యంత్రాంగం లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేపడుతున్నారు. ఇందుకోసం 61 మంది అధికారులు సిబ్బంది బృందాలుగా ఏర్పడి సర్వే చేపడుతున్నారు. ఈ సర్వే నెలాఖరు వరకు కొనసాగనుంది.

ఏడుగురు పంచాయతీ సెక్రెటరీలకు షోకాజ్ నోటీసులు

- ఇందిరమ్మ ఇళ్లు గ్రౌండింగ్ చేయకపోవడమే కారణం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడు గ్రామ పంచాయతీలకు సంబంధించి సెక్రెటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో పంచాయతీ శాఖ ఉన్నతాధికారులు ఏడు గ్రామాల సెక్రెటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బీబీపేట మండలంలో శివారు రాంరెడ్డిపల్లి, గాంధారిలో బ్రాహ్మణపల్లి, మాచారెడ్డిలో రాజ్‌ఖాన్‌పేట, నస్రూల్లాబాద్‌లో రాములు గుట్ట తండా, నిజాంసాగర్‌లో సుల్తాన్‌నగర్, పిట్లంలో ఫసలపూర్, తాడ్వాయిలో సంతాయిపేట గ్రామ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. వీరితో పాటు జిల్లా పరిషత్ పరిధిలోని పలువురు ఎంపీడీఓలకు సైతం ఆ శాఖ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

ఫటా.. ఫట్...

ఎకరానికి 14 క్వింటాళ్ల జొన్నల కొనుగోళ్లు చేపడతాం



జిల్లా మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జ్ డీఎం మహేష్‌కుమార్

- జిల్లాలో జొన్నల కొనుగోళ్లు చేపడుతున్నాం
- ఇప్పటి వరకు 1000 టన్నులు కొనుగోలు చేశాం
- 19 కేంద్రాలను ఏర్పాటు చేశాం
- మక్కల కొనుగోళ్లకు అనుమతి రాలేదు
- వానా కాలానికి 8 మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు అందుబాటులో ఉన్నాయి
- జిల్లా మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జ్ డీఎం మహేష్‌కుమార్

జిల్లాలో మార్క్‌ఫెడ్ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం జొన్నల కొనుగోళ్లు చేపడుతున్నాం. కొనుగోళ్ల కోసం మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 1000 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేశాం. మక్కల కొనుగోళ్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్‌శాఖ సిద్ధంగా ఉంది. ప్రభుత్వం ఆదేశిస్తే కొనుగోలు చేస్తాం. మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో మక్కలకు మంచి డిమాండ్ ఉంది. వానాకాలం సీజన్‌కు సంబంధించి 8వేల మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచాం. సీజన్ ప్రారంభం కాగానే సొసైటీల ద్వారా పంపిణీ చేస్తామని జిల్లా మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జ్ డీఎం మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ఆయన వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఏ పంటను కొనుగోలు చేస్తున్నారు?

అధికారి: మార్క్‌ఫెడ్ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం జొన్నల కొనుగోళ్లు సాగుతున్నాయి. గత 15 రోజుల కిందటే జొన్నల కొనుగోళ్లకోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ యాసంగి సీజన్‌లో 71 వేల ఎకరాలలో జొన్న పంట సాగైంది. ఈ లెక్కన 90వేల మెట్రిక్‌టన్నుల జొన్నల దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ నివేదించింది.

ఆంధ్రజ్యోతి: జొన్నల కొనుగోళ్ల లక్ష్యం ఎంత?

అధికారి: జిల్లాలో వ్యవసాయశాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సుమారు 50వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోళ్లకు లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు 40 వేల మెట్రిక్ టన్నుల జొన్నలను మార్క్‌ఫెడ్‌కు తరలించేఅవకాశం ఉంది. ఇప్పటివరకు 1000 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేశాం. ప్రభుత్వ మద్దతు ధర రూ.3371 క్వింటాల్‌కు ఉంది.

ఆంధ్రజ్యోతి: ఎన్ని జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు?

అధికారి: జిల్లాలో 19 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, ఆర్గొండ, కారేగావ్, గాంధారి, పిట్లం, పుల్కల్, తిమ్మనగర్, గుంకుల్, బోర్లం, పెద్దకొడప్‌గల్, చిన్నకొడప్‌గల్, ముదేళి, ఎల్లారెడ్డి, పద్మాజీవాడి, మల్లూరు, అచ్చంపేట్, తాండూరు కిచ్చనపేటలో కేంద్రాలను ఏర్పాటు చేశాం

ఆంధ్రజ్యోతి: కొనుగోళ్లకు ఏమైన నిబంధనలు ఉన్నాయా?

అధికారి: గతంలో జొన్నల కొనుగోళ్లకు ప్రభుత్వం ఎకరాన 8.65 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని నిబంధనలు పెట్టింది. అయితే ఇటీవల రైతుల వినతి మేరకు ప్రభుత్వం ఎకరాన 14 క్వింటాళ్ల కొనుగోలుచేయాలని ఆదేశించింది. ఆదేశాల మేరకు కొనుగోలుచేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: మక్కల కొనుగోళ్లు చేపట్టడడం లేదా?

అధికారి: మక్కల కొనుగోళ్లకోసం ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2225 ఉంది. అయితే మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో రూ.2150 నుంచి రూ.2220 వరకు ధర పలుకుతుంది. దీంతో రైతులు ఎక్కువగానే బహిరంగ మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు.అయినప్పటికి జిల్లాలో మక్కల కొనుగోళ్ల కోసం 29 కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించి ప్రభుత్వానికి నివేదించాం. 70 వేల మెట్రిక్ టన్నుల మక్కల దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ నివేదించింది. ప్రభుత్వం నుంచి కొనుగోళ్లకు ఆదేశాలు రాకపోవడంతో కేంద్రాలను ఏర్పాటుచేయలేదు.

ఆంధ్రజ్యోతి: వానకాలం సీజన్ కోసం ఎంతమేర ఎరువులు ఉన్నాయి?

అధికారి: వ్యవసాయశాఖ నిర్దేశించిన కోటా కింద వానకాలం సీజన్‌కు 53,062 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయి. ప్రస్తుతానికైతే మార్క్‌ఫెడ్ శాఖ పరిధిలో 8 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. 7 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 325 మెట్రిక్ టన్నుల డీఏపీ, 710 మెట్రిక్ టన్నులకాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయి. వానకాలం సీజన్ ప్రారంభం కాగానే సొసైటిల ద్వారా రైతులకు సరాఫరా చేస్తాం.

- కామారెడ్డి, ఆంధ్రజ్యోతి

మద్దెల చెరువు నుంచి పిట్లం వరకు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మద్దెల చెరువు నుంచి పిట్లం వరకు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో అటవీ, రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దెల చెరువు నుంచి పిట్లం వరకు గల రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, అటవీ కాని ప్రాంతంలో చెట్లు నరికివేతకు అటవీశాఖ అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అటవి కాని ప్రాంతంలో ఉన్న చెట్లను శాఖాపరమైన పద్ధతిలో పరిహారం చెల్లించి తొలగించాల్సిందిగా రోడ్డు భవనాల శాఖను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డీవో వీణ, ఆర్‌అండ్‌బీ ఈఈ రవిశంకర్, ఎఫ్‌డీవో రామకృష్ణ, ఎఫ్ఆర్‌వో రవి, ఏఈఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలి

గాంధారి: రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం గాంధారి మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు కురిసే అస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్‌లను అందజేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోలు జరిగిన వివరాలను సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా అధికారి మల్లిఖార్జున్ బాబు, రాంమోహన్, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, తహసీల్దార్ రేణుకా చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భూ భారతి దరఖాస్తులను పరిశీలించాలి

లింగంపేట/జుక్కల్/బిచ్కుంద: రాష్ట్రంలో పైలెట్ మండలంగా ప్రారంభమైన భూ భారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన ప్రతీ దరఖాస్తును రెవెన్యూ సిబ్బంది పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట, జుక్కల్ మండలాల్లో భూ భారతి గ్రామసభలను నిర్వహించారు. ఈనెల 17 నుంచి ఇప్పటి వరకు జరిగిన భూ భారతి గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలపై అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 12 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని మొత్తం 1416 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ సురేష్, డీటీ రాందాస్, ఆర్ఐ కిరణ్‌లతో పాటు రైతులు ఉన్నారు.

వరంగల్ వేదికగా కాంగ్రెస్ సర్కార్‌ను ప్రశ్నించాలి

బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కామారెడ్డి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న వేదిక నుంచి కాంగ్రెస్ సర్కార్‌ను ప్రజలు ప్రశ్నించాలని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రజల నుంచి పుట్టిన పార్టీ అని ప్రజల తరపున కాంగ్రెస్ సర్కార్‌పై పోరాడేందుకు వరంగల్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేదిక నుంచి మాజీ సీఎం కేసీఆర్ లక్షలాది మంది ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణుల సమక్షంలో కాంగ్రెస్ మోసపూరిత హామీలపై నిలదీయనున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై కేసీఆర్ రేవంత్‌రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేయనున్నారని అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రసాధన కోసం 27 సంవత్సరాల కిందట కేసీఆర్ ఒక్కడిగా బయలుదేరి ఉద్యమాన్ని ప్రారంభించారని అన్నారు. దీంతో పాటు బీఆర్ఎస్ ఆవిర్భవించిందన్నారు. పార్టీ ఆవిర్భవించి 27 సంవత్సరాలు పూర్తవుతున్నందున ఏడాది మొత్తం పార్టీ రజతోత్సవాలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారని అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 నియోజకవర్గాల నుంచి 50వేల మంది బీఆర్ఎస్ శ్రేణులు తరలిరానున్నారని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులను, ప్రజలను తరలించేందుకు 250 ఆర్‌టీసీ బస్సులను, 264 ప్రైవేట్ బస్సులను, 626 ట్యాక్సీ వాహనాలను, 1260 సొంత బీఆర్ఎస్ వాహనాలను సమకూరుస్తున్నామన్నారు. ఈ సభ వేదిక నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం అయ్యే విధంగా ప్రజలు ఉద్యమించాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి మాయ మాటలు చెప్పి అన్ని వర్గాల ప్రజలను తమ వైపు తిప్పుకుని ప్రభుత్వాన్ని రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. తీరా ప్రభుత్వంలోకి వచ్చాక రైతులను, మహిళలను, నిరుద్యోగులను, విద్యార్థులను, కార్మికులను, ఉద్యోగులను ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. రైతుల రుణమాఫీ పూర్తి చేయకుండా, రైతుభరోసా నిధులు వేయకుండా రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేశారన్నారు. కేసీఆర్ పది సంవత్సరాల పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయంలో మొదటి స్థానంలో ఉండేదన్నారు. ఇప్పుడు అసమర్థ సీఎం రేవంత్‌పాలనలో 11వ స్థానానికి దిగజారిందన్నారు. ఇలాంటి మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీఎం రేవంత్‌రెడ్డిని వరంగల్ బహిరంగ సభ నుంచి ప్రజలు ప్రశ్నించేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్‌షిండే, జాజాల సురేందర్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి కలెక్టరేట్‌కు మార్క్‌ఫెడ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మార్క్‌ఫెడ్ శాఖ కార్యాలయాన్ని కామారెడ్డి కలెక్టరేట్‌కు తరలించారు. కార్యాలయంలోని సిబ్బంది, అధికారులు విధులు కొనసాగిస్తున్నారు. 'మార్క్‌ఫెడ్ ఉన్నా.. లేనట్టే!' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 21న ప్రచురించడం జరిగింది. ఆరుతడి పంటలు జిల్లాలో ఎక్కువగా సాగవుతుండడం ప్రధానంగా మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, తాడ్వాయి, సదాశివనగర్, గాంధారి దూర ప్రాంతాల రైతులకు ఏవైన సమస్యలు ఉంటే నిజామాబాద్‌కు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మార్క్‌ఫెడ్ కార్యకలాపాలు రికార్డుల నిర్వహణ నిజామాబాద్ నుంచే కొనసాగుతున్నాయని 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, మార్క్‌ఫెడ్ రాష్ట్రస్థాయి అధికారులు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని కామారెడ్డి కలెక్టరేట్‌కు తరలించాలని ఆదేశించారు. దీంతో మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జ్ డీఎం మహేష్‌కుమార్ నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతూ వచ్చిన శాఖ కార్యకలాపాలకు సంబంధించి రికార్డులను, ఫర్నిచర్, కంప్యూటర్‌లను గత మూడు రోజుల కిందటే కామారెడ్డి కలెక్టరేట్‌కు తరలించారు. కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల శాఖ ఉన్న విభాగంలో మార్క్‌ఫెడ్ శాఖకు ఓ గదిని కేటాయించారు. అదేవిధంగా ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. ఇకపై కామారెడ్డి మార్క్‌ఫెడ్ కార్యకలాపాలన్నీ కలెక్టరేట్ నుంచే కొనసాగుతాయని రైతులకు ఏవైన ఇబ్బందులు ఉంటే కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చని డీఎం మహేష్‌కుమార్ తెలిపారు.



కామారెడ్డి మార్క్‌ఫెడ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రోహిత్ రెడ్డి



రెంజల్‌లో టీకాలు వేస్తున్న దృశ్యం

రెంజల్,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): పశువులు కలిగిన ప్రతి ఒక్కరు ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రోహిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పశువులకు సోకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు గాలికుంటు నివారణ టీకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ విఠల్, జూనియర్ పశువైద్యులు నాగరత్నం, గంగారాజు, నవీన్, లక్ష్మణ్, సావిత్రి, గోపాలమిత్రలు భాస్కర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : రైతులు తమ పశువులకు సకాలంలో గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్కోర గ్రామంలో ఉచిత పశువైద్య గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ రోహిత్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది సురేష్, గంగాధర్, మౌలానా, బాబులాల్, గోపాలమిత్ర, గ్రామపాడి రైతులు పాల్గొన్నారు.

మాక్లూర్ : ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు డాక్టర్ కిరణ్ దేశ్‌పాండే, డాక్టర్ ఉమమసాహెద్ లు తెలిపారు. శుక్రవారం మధన్‌పల్లి మండలంలోని మధన్‌పల్లి క్యాంపు, మదన్‌పల్లి తాండ, సట్లాపూర్ తాండాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినిత, కళ్యాణి, హైమద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని సిరన్‌పల్లి, లింగాపూర్‌లలో శుక్రవారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందించారు. ఆయా గ్రామాలలోని తెలుపు, నలుపు జాతికి చెందిన 385పశువులకు ఈ టీకాలు అందించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, రవి, కోరే గంగాధర్ లున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ 33/11సబ్ స్టేషన్ మరమ్మత్తుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏడీఈ అశోక్ తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు సంబంధిత సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఈ విషయంలో వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

వర్ని,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ ఏజాస్ అన్నారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో జరిగే సభను వర్ని మండల పరిధిలోని ఉన్న అన్ని గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ఏజాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ యాదవ్, జంగం రాచప్ప, షేక్ ఉస్మాన్, ప్రభాకర్, ఆనంద్ గౌడ్, మహేందర్ రెడ్డి, గైని లక్ష్మణ్, రాజేష్, జిశాన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో లెక్చరర్ల ప్రచారం

మోర్తాడ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ టి. పెద్దన్న ఆదేశాల మేరకు లెక్చరర్లు నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన స్థలాల వద్ద పోస్టర్లు అతికించారు. బ్యానర్లు కట్టారు. విద్యార్థులను కలిసి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని కోరారు. ప్రతీ గ్రామంలో మైక్‌ద్వారా ప్రచారం నిర్వహించారు. ఉచిత అడ్మిషన్, స్కాలర్‌షిప్, బస్‌పాస్, ప్రభుత్వ ఉద్యోగ కోచింగ్ నిర్వహించబడుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మర్రిపల్లి భూపతి, కోఆర్డినేటర్ దశరథ, రవీందర్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్, టైలరింగ్‌ల శిక్షణ కేంద్రాలు ప్రారంభం

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ దుర్గాబాయి మహిళ శిశువికాస కేంద్రంలో శుక్రవారం కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ కేంద్రాలను మహిళ కమీషన్ మెంబర్ సూదంలక్ష్మీ జిల్లా సంక్షేమశాఖ అధికారిని రసుల్ బిలు ప్రారంభించినట్లు జిల్లా అధికారిణి పి. ఇంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలరింగ్, కంప్యూటర్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఆదాయవనరులు ఏర్పర్చుకోగలుగుతారని వారు అన్నారు. అనంతరం మహిళలు శిశువుల భద్రత కోసం 1098, 181 కాల్ సెంటర్ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సిడిపివో భార్గవి, సిబ్బంది రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్ వీడీసీ ని రద్దు చేయాలని ధర్నా



ఆర్డీవో కార్యాయం ఎదుట మాట్లాడుతున్న నాయకులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): తాళ్లరాంపూర్ విడిసి ని రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బీసీల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ గతకొన్ని రోజుల క్రితం తాళ్లరాంపూర్ గ్రామంలో గీతా కార్మికులను వీడీసీ సభ్యులను బహిష్కరించారని, ఇంతవరకు వీడీసీ సభ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ గ్రాడ్యుయేట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అబ్బగోనే అశోక్‌గౌడ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సూరినీడ ధశరత్, బీసీ గ్రాడ్యుయేట్ ఫోరం ఆదిలాబాద్ అధ్యక్షుడు అంబదాస్, జిల్లా అధ్యక్షుడు సురేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పడిగెల బాల్‌రాజ్ మాట్లాడుతూ తాళ్లరాంపూర్ ఘటన రాష్ట్ర బీసీకులాల్లో మార్పురావాలని అన్నారు. గతంలో గంగపుత్ర, ముదిరాజ్, యాదవ, రజక, మున్నూర్ కాపు తదితర కులాలను బహిష్కరించారని వీడీసీలు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు.

ఉగ్రదాడిపై అంతటా నిరసనలు



ఆర్మూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బార్ కౌన్సిల్ సభ్యులు

పెర్కిట్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహాల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రతీ భారతీయులు ఖండించాలని పహాల్గాంలో వీరమరణం పొందిన భారతీయులకు నివాళులు అర్పిస్తు ఆర్మూర్ పట్టణంలో విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కొవ్వోత్తుల ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కొవ్వోత్తుల ర్యాలీ శివాజీచౌక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఉగ్రదాడికి నిరసనగా పాకిస్తాన్ దిష్టి బొమ్మ దహనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, విశ్వహిందుపరిషత్, భజరందళ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ఆర్మూర్ టౌన్ : పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇటీవల జమ్ముకాశ్మీర్‌లో పహాల్గాంలో జరిగిన ఉగ్రదాడి సంఘటనతో రాష్ట్ర బార్ కౌన్సిల్ పిలుపుమేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేయడం వారు తీవ్రంగా ఖండించారు. అలాంటి ఉగ్రదాడులను వెంటడి, వేటాడి శిక్షించవల్సిన అవసరం భారతదేశ ప్రభుత్వంపై ఉందని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠినమైన చట్టాలు చేస్తూ నియంత్రించి ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ఉపాధ్యక్షుడు గట్టడి ఆనంద్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, కోశాధికారి చైతన్య, శ్రావణ్, ఏజీపీ చిన్నారెడ్డి, తెడ్డు నర్సయ్య, దేవన్న, జీవన్, ప్రవీన్‌చందర్, గోవిందరాజు, బబ్లుపాల్, బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : జమ్ముకాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని వేల్పూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో అమరులైన వారికి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. అసువులుబాసిన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని కోరారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, దీన్ని ప్రతీ భారత పౌరుడు ఖండించాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ మండల అంబేద్కర్, యువజన సంఘం అధ్యక్షులు, సంఘం సభ్యులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : జమ్ముకాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడులకు నిరసనగా శుక్రావారం హిందుసంఘాల ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా కమ్మర్‌పల్లి బంద్ సక్సెస్ అయింది. శుక్రవారం దుకాణదారులు, వ్యాపారవేత్తలు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలిపారు. కాగా ఉదయం స్థానిక భరతమాత విగ్రహంవద్ద హిందుసంఘాల సభ్యులు మానవహారంగా ఏర్పడి అమరులైన టూరిస్టులకు ఘనంగ నివాళులర్పించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, ఆమెడ నరేందర్, రమణయ్య, బద్రి, రేగుంట దేవేందర్, రాజశేఖర్, ప్రవీన్ పాల్గొన్నారు. జమ్ముకాశ్మీర్ పహల్గావ్ ఉగ్రదాడులకు నిరసనగా శుక్రావారం నమాజ్ అనంతరం స్థానిక జామ మజీద్ ఎదురుగా పాకిస్తాన్, ఉగ్రముఖల దిష్టిబొమ్మను దహనం చేసి ఉగ్రముకల దాడిలో అసువులుబాసిన టూరిస్టులకు నివాళలర్పించారు. ఉగ్రదాడులకు పాల్పడినవారిని గుర్తించి ఉరితీయాలని నినాదాలు చేశారు. ఇస్లాంమతం సర్వదా శాంతినే కోరుకుంటుందని మజీద్ కమిటీ అధ్యక్షుడు హుసేన్ అన్నారు.

నేడు భీమ్‌గల్ బంద్

భీమ్‌గల్ : విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో బందుకు పిలుపునిచ్చారు. కులాలను పక్కన బెట్టి హిందువులు బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బందులో వ్యాపారస్తులు, ప్రజలు పాల్గొని సహకరించాలని విశ్వహిందు పరిషత్ భీమ్‌గల్ పట్టణ శాఖ కోరింది.

వర్ని : పహల్గాం ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత పౌరులకు మౌనం పాటిస్తూ వర్ని మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం నుండి సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వరకు ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల ముస్లిం సోదరులు మౌనంపాటించారు. ఇస్లాం ఎన్నటికి ఇలాంటి చర్యలను అంగీకరించదని ఈ దాడికి పాల్పడిన ముష్కరులను శిక్షించాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. హిందు ముస్లింలు అంత ఒక్కటేనని పేర్కొన్నారు.

బోధన్‌రూరల్ : పాకిస్థాన్ దేశానికి భారత దేశం గుణపాఠం చెప్పాలని, దెబ్బకు దెబ్బ కొట్టి ఉగ్రమూకలను హతమార్చాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారికి శాంతిచేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రమూకలను పట్టుకుని హతమార్చాలని పేర్కొన్నారు. పాకిస్థాన్ దేశానికి భారత దేశం గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తోకల గంగారెడ్డి, గుమ్ముల అశోక్ రెడ్డి, నక్క లింగారెడ్డి, రజాక్, అశ్వక్, పెరక రామకృష్ణ, రవి శంకర్ గౌడ్, ఎన్ఆర్ఐ హైమద్, విద్యాసాగర్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి



పెద్ద మల్లుగొండ (ఫైల్)

రెంజల్,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపం గత మూడు రోజుల నుంచి దగదగమనడంతో ఎండ తీవ్రతలు అధికమయ్యాయి. బయటకు వెళ్లాలంటేనే భయం గుప్పిట్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రోజుమాదిరిగా గొర్రెలను కాచేందుకు వెళ్లిన మల్లుగొండ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మండలంలోని బాగేపల్లి గ్రామానికి చెందిన పినిగిరి పెద్ద మల్లుగొండ అనే గొర్రెల కాపరి వడదెబ్బ తగిలి మృతిచెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న మల్లుగొండ మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఎండలు అధికంగా ఉండడంతో రోజు మాదిరిగా గొర్రెలను కాచేందుకు మల్లుగొండ గొర్లు ఇంటికి వచ్చిన కూడా మల్లుగొండ ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు మల్లుగొండ ఆచూకీ వెతకగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గొర్రెలను తీసుకుని రాగా అక్కడికక్కడే ఎండ వేడిమి తట్టుకోలేక అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామస్థులు మల్లుగొండ మృతదేహన్ని ఇంటికి తీసుకువచ్చారు. మల్లుగొండ గొర్రెలను కాస్తూ జీవనం సాగిస్తూ ఉండేవని అన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బతో మృతి చెందడంతో గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పనులు అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలి

● డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్



మాట్లాడుతున్న అధికారులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పనులు అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో ఉపాధిహామీ పథకం పనులపై 16వ విడత మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేధిక జరిగింది. ఈ సమావేశానికి పీడీసీ సాయాగౌడ్ హాజరై మాట్లాడారు. పనుల కోసం వచ్చే కూలీలకు జాబ్‌కార్డులు లేకపోతే జాబ్‌కార్డులు ఇప్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని 21 గ్రామాలలో గడిచిన ఏడాదిలో ఉపాధిహామి పథకం పనులపై సామాజిక తినిఖీ ప్రజావేదికలో గ్రామస్థాయి తనిఖీ బృందం సభ్యులు కూలీలు చేసిన పనుల వివరాలను గ్రామాలవారిగా చదివి వినిపించారు. ఉపాధిహామీ పనులకు రాకున్న కూలీలకు డబ్బులు చెల్లించారని, పనులకు రాకున్న వచ్చినట్లు మాస్టర్‌లో కూలీలకు హాజరువేసి వారికి కూలీ డబ్బులు చెల్లించారని గ్రామస్థాయి తనిఖీ బృందం సభ్యులు సామాజిక తనిఖీ ప్రజావేదికలో చదివి వినిపించారు. పుప్పాలపల్లి, గన్యతాండా, సికింద్రాపూర్ గ్రామాలలో పనులు చేయకుండానే కూలీలకు మాస్టర్లలో హాజరు వేసి డబ్బులు చెల్లించారని గ్రామ తనిఖీ సభ్యులు చదివి వినిపించారు. పనులు చేయకుండా డబ్బులు తీసుకున్న కూలీల నుంచి తిరిగి ఆ డబ్బులను రికవరి చేయాలని ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పీడీ సాయాగౌడ్ ఆదేశించారు. గ్రామాల్లో మొక్కలు నాటగా సగం వరకు ఎండిపోయాయని తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో చదువుగా ఎండిపోయిన వాటిస్థానంలో కొత్తగా మొక్కలు నాటించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. వివిధ గ్రామాలలో ఒకే కుటుంబంలో రెండు చొప్పున జాబ్‌కార్డులు ఉన్నాయని ఈ జాబ్‌కార్డులపై కుటుంబ సభ్యులు పను లు చేశారని, కూలీ డబ్బులు చెల్లిం చారని ప్రజావేదికలో గామ తనిఖీ బృం దం సభ్యులు తెలుపగా ఒక్క కుటుం బంలో ఒకే జాబ్‌కార్డుపై పనులు చేయాలని అధికారులు సూచించారు. రెండో జాబ్‌కార్డుపై పనిచేసిన ఆ కూలీ డబ్బులను రికవరీ చేయాలని ఆ గ్రామ ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు పీడీ ఆదేశించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి నారాయణ, యస్ఆర్‌పీ రవి, ఎంపీడీవో సతీష్‌కుమార్, పీఆర్ఏఈ సురేంద్రవర్మ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌రెడ్డి

ముప్కాల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మడలం నాగంపేట్ గ్రామానికి చెందిన ఏలేటి గంగాధర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలు

భీమ్‌గల్ రూరల్ , ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలం కొత్తతాండ గ్రామ పంచాయితీ పరిధిలో శుక్రవారం ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలయ్యాయి. బుక్య మంజులా అనే మహిళ ఉదయం గ్రామ శివారులో తూనికాకు సేకరణకు వెళ్లగా వెనుకనుంచి వచ్చిన ఎలుగుబంటి ఆమెపై దాడిచేసి గాయపరిచింది. పక్కనే ఉన్న కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో ఎలుగుబంటి అటవి ప్రాంతంలోకి వెళ్లిపోయింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం భీమ్‌గల్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఆర్మూర్‌లోని ప్రైయివేట్ ఆసుపత్రికి తరలించారు.

ఆర్మూర్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లో శుక్రవారం రాత్రి పోలీసులు జాగిలాలచే తనిఖీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ తో పాటు సైకిల్ స్టాండ్ ఇతర ప్రాంతాలలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

మోస్రా,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు తట్టుకోలేక మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మోస్రాలో నెలకొంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం మోస్రా మండల కేంద్రానికి చెందిన కుమ్మరి గంగారాం ఒక పెట్రోల్ బంక్‌లో పని చేస్తుండగా అవసరం నిమిత్తం అప్పులు చేసి అప్పులు తీర్చుకోలేక ఎలా తీర్చాలనే మనస్థాపం చెందిన గురువారం నాడు గ్రామ పెద్చార చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిఇ శవపరీక్ష నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ మహేష్ తెలిపారు.

హంగర్గలో అంబేద్కర్ జయంతి

కోటగిరి,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలు కొనియాడారు. అనంతరం కాలనీలో యువత డీజే ఆటపాటలతో కొలాటాల మధ్య అంబేద్కర్ చిత్రపటంతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కోటగిరి,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): కోటగిరి శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజవ్వ(56)అనే వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. జుక్కల్ మండలంలోని కేమ్‌రాజ్ కల్లాలి గ్రామానికి చెందిన అంజవ్వ పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో గురువారం జరిగిన పెళ్లికి వచ్చింది. అనంతరం రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కోటగిరి శివారులో కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భర్త బలరాం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ఆలూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలంలోని మిర్దాపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎంపీడీవో గంగాధర్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో 127 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు కాగా పునాదుల దశో మరికొన్ని పిల్లర్ల దశలో ఉన్నాయి. ఇండ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నవీన్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ దరఖాస్తుల స్వీకరణ

ముప్కాల్, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకుల కళాశాలలో 2025-26 సంవత్సరం కు గాను ప్రవేశాలకు ఈనెల 25 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ముప్కాల్ మండల విద్యాధికారి రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్ ద్వారా ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్ కోర్సులలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

చలివేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



చలివేంద్రాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మంచినీటిని ఎల్లవేళల అందుబాటులో ఉంచాలని పట్టణ ప్రజలు, ప్రయాణీకులు చలివేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, చలివేంద్ర ఇన్‌చార్జి సురేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా వ్యాధి నివారణకు కృషి చేయాలి



నవీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది

నవీపేట,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వచ్చే 2030లోగా దోమల నివారణతో పాటు మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు కావ్య, ప్రవళిక, ఎంపీహెచ్‌వో వెంకటేశ్వర్ రావు, సూపర్‌వైజర్ కిషన్, గోదావరి, వినయ కుమారి, పుష్ప, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోస్రా : మండల కేంద్రంలో ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి మండల కేంద్రంలో మలేరియాకు సంబంధించినటువంటి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ్ మాట్లాడుతూ ఇంటి, దుకాణ సముదాయాల చుట్టు పక్కన నీళ్లు నిల్వకుండా జాగ్రత్త పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీ పీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వచ్చే 2030లోగా దోమల నివారణతో పాటు మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అలీమొద్దీన్, సూపర్‌వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతీఇంట శుభ్రతను పాటించాలని, నీటి నిల్వలు ఉండకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్త వహించాలని, దోమలు ఉత్పత్తికాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియకు గుడ్‌బై చెబుదాం అంటు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పిర్దోస్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ సాయి, ఆనంద్, సురేష్, కృష్ణ, ఏఎన్ఎంలు రాజవ్వ, విజయ, సౌందర్య, స్వాతి, విజయశ్రీ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కోటగిరి,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కల్లూర్, కొడిచర్ల గ్రామాలలో శుక్రవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో చందర్ పరిశీలించారు. చెరువుల్లో ఫిష్ పాండ్స్ పనులను పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి



బాన్సువాడలో పోచారానికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

కోటగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో వ్యవసాయ కళాశాల(బీఎస్సీ అగ్రికల్చర్) హాస్టల్స్, జూనియర్ కళాశాలలను మంజూరు చేయాలని రుద్రూరు ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రైడ్స్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో రైడ్స్ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, కార్యదర్శి శేఖర్, కోశాధికారి మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థిని సన్మానించిన పాఠశాల యాజమాన్యం

ఎడపల్లి, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన తమ పూర్వ విద్యార్థిని గోఫూర్ మహితను శుక్రవారం శ్రీ మాధవీ హైస్కూల్ పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో మహిత తల్లిదండ్రులు గోఫూర్ సాయరెడ్డి, మం జుల, సోదరి అక్షయ, పాఠశాల ఉపాధ్యాయులు మాధవి ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మోస్రా,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు తట్టుకోలేక మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మోస్రాలో నెలకొంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం మోస్రా మండల కేంద్రానికి చెందిన కుమ్మరి గంగారాం పెట్రోల్ బంక్‌లో పని చేస్తుండేవాడు. అవసరం నిమిత్తం చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపం చెందిన గురువారం గ్రామ పెద్చార చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవపరీక్ష నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ మహేష్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

రెంజల్,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో ఒకరి జైలు శిక్ష పడింది. మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించగా నీలా గ్రామానికి షేక్ అక్బర్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనాన్ని నడపడంతో ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేశారు. బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

వేసవికాలం అప్రమత్తంగా ఉండాలి

నవీపేట,ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): ప్రజలు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వినయ్ కోరారు. వేసవికాలం కావడంతో పలువురు ఉక్కపోత భరించలేక రాత్రి వేళలో ఇంటి ఆవరణలో గాని ఇంటి దాబాల పైన పడుకుంటారని, ఇటువంటి సమయంలో దొంగలు ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను ఎత్తుకుపోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇళ్లలో ఉన్న విలువైన వస్తువులను బీరువా, ఇతర అల్మారలో కాకుండా ఎవరు గుర్తించని ప్రదేశాలలో పెట్టుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

గోపాలమిత్రల గోస తీరేదెన్నడో..!?

● చాలీచాలని పారితోషికాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న గోపాలమిత్రలు

సదాశివనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాలలో మేలు జాతి పశువుల ఉత్పత్తికి కృషి చేస్తున్న గోపాలమిత్రలకు కష్టాలే తప్ప ఏమీ మిగలడం లేదని జిల్లాలోని గోపాల మిత్రలు వాపోతున్నారు. సుమారు 30 సంవత్సరాల క్రితం పశుగణన ఆధారంగా మండలానికి ముగ్గురు లేదా నలుగురు చొప్పున ప్రభుత్వం గోపాల మిత్రలను నియమించింది. గ్రామీణ ప్రాంత పశువులకు మేలు జాతి వీర్యాన్ని ప్రభుత్వం సేకరించి సంబంధిత పశువైద్యశాల నుంచి గోపాల మిత్రలకు కంటైనర్ ద్వారా సరాఫరాచేసి గ్రామీణ ప్రాంతాల్లో సంకర జాతి పశువులను ఉత్పత్తి చేయడమే గోపాల మిత్రల ఏకైక లక్ష్యంగా ప్రభుత్వం నియమించింది. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం అందక పోవడంతో వైద్యుల సహాయంలో గోపాలమిత్రలు పశు వైద్యులుగా అన్ని వ్యాధులకు చికిత్సలు నిర్వహిస్తూ వస్తున్నారు.



గేదెలకు గర్భధారణ చేయిస్తున్న గోపాలమిత్రలు

కృత్రిమ గర్భధారణ గోపాలమిత్రలకు ఏకైక లక్ష్యం

జిల్లాలో 58 మంది గోపాలమిత్రలు నియమించిన ప్రభుత్వం ఒక్కొక్కరు 1180 కృత్రిమ గర్భధారణ చేయాల్సి ఉంటుంది. వీర్యకణాల స్ట్రాలకు ఒక్కోదాని రూ.40 ప్రభుత్వానికి గోపాల మిత్రలు గతంలో చెల్లించాల్సి ఉండేది. గ్రామీణ ప్రాంతాలలోని స్థానిక జాతి గేదెలు, ఆవులలో సంకరజాతి నాణ్యమైన గేదెలు, ఆవులను పాల ఉత్పత్తిని పెంచడానికి దృష్టిలో ఉంచుకుని ఈ గర్భధారణ కార్యక్రమాన్ని గతంలో ప్రభుత్వాలు చేపట్టాయి. గోపాల మిత్రలు కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం నెలకు 11050 ఇన్సెంటివ్ కింద ప్రకటించి చెల్లించారు. గోపాలమిత్రలు ఉపాధి కోసం ఉదయం నుండి క్షేత్రస్థాయిలో కృత్రిమ గర్భధారణ సాధారణ పశు చికిత్సలతో పాటు ప్రభుత్వ పశువైద్యధికారులకు, సిబ్బందికి సహాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 8 నెలల నుంచి ప్రోత్సాహకం అందడం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన 11050 ప్రోత్సహకం ప్రతినెల క్రమం తప్పకుండా రాకపోవడంతో గోపాలమిత్రలు కుటుంబాలు పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. గత 8 నెలల నుంచి ప్రోత్సహకాలు విడుదల కాకపోవడంతో గోపాలమిత్ర లు ప్రోత్సాహకం ఎప్పుడు అందుతుందో తెలియక సతమవతవుతునే ఉన్నారు.

వీర్య కణాల స్ట్రాలను ప్రభుత్వం అందిస్తుంది

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న గోపాలమిత్రలు వీర్యకణాల స్ట్రాలను కొనుగోలు చేయలేని పరిస్థితి ఒక్కోసారి ఎదురవుతుండడంతో ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని వీర్యకణాల స్ట్రలాలను గోపాలమిత్రలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. దీనికి సంబంధించి కంటైనర్ కూడా అందించడలో పశువుల ఎద సమయంలో ఉన్నప్పుడు పశుపోషకులు పాడి రైతులు గోపాలమిత్రలకు ఫోన్ చేయడం ద్వారా అక్కడికి వెళ్లి పశువులకు కృత్రిమ గర్భధారణ చేస్తున్నారు.



పశు వైద్య శిబిరంలో సహాయం చేస్తున్న గోపాలమిత్రలు

నెలనెలా ఇన్సెంటివ్ అందించాలి

● మహిపాల్‌రెడ్డి, గోపాలమిత్ర

ప్రభుత్వం ప్రకటించిన పారితోషికం నెలనెలా అందకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం 8 నెలల నుంచి పారితోషికాలు అందించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పెండింగ్‌లో ఉన్న పారితోషకాలను విడుదల చేసి నెల నెలా క్రమం తప్పకుండా ఇన్సెంటివ్‌లు ఇవ్వాలి.



ఇన్‌చార్జి ఆర్‌డీవోకు సమస్యలు విన్నవిస్తున్న దృశ్యం(ఫైల్)

సమస్యలు చెప్పినా పట్టింపు కరువు!

● అంధకారంలో డబుల్ గృహాలు

ఇందల్వాయి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పట్టించుకోమని ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా సమస్యలను పట్టిం చుకునే వారే కరువయ్యారని ఇందల్వాయి డబుల్ ఇళ్ల లబ్ధి దారులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ లేక అల్లాడుతున్నామని అధికారులకు ఎన్నోసార్లు చెప్పిన పట్టింపు కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు విచ్చేసిన ఇన్‌చార్జి ఆర్‌డీవో స్రవంతికి గోడు చెప్పుకున్నారు. డబుల్ ఇళ్లలో 48 కుటుంబాలు నివసిస్తున్నామని ఇళ్లు మంజూరు చేసి ఏళ్లు గడుస్తు న్నా నాటి నుంచి నేటి వరకు ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయని లబ్ధిదారులు ఆవేదన చెందుతూ ఇన్‌చార్జి ఆర్‌డీవోకు విన్నవించారు. తాగునీరు, డ్రైనేజీ నిర్మాణా లు చేపట్టాలని విన్నవించారు. దీంతో ఆర్‌డీవో డబుల్ ఇళ్లకు వెళ్లి స్వయంగా పరిశీలించారు. ప్రజల సమస్యలను లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల వినూత్న నిరసన



భిక్కనూరు టీయూ సౌత్‌క్యాంపస్‌లో ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ కాంట్రాక్ట అధ్యాపకులు డిమాండ్ చేశారు. సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం ఏడవరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఒంటికాలుపై నిలబడి వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత చాలా సంవత్సరాలుగా యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల ముందు కాంట్రాక్ట్ అధ్యాప కులకు ఇచ్చిన న్యాయ మైన హామీలను నేరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యా పకులు నారాయణ, యాలాద్రి, సునీత, నర్సయ్య, నిరంజన్, శ్రీకాంత్, వైశాలీ, తదితరులు పాల్గొన్నారు.

నాల్గో రోజుకు చేరుకున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమ్మె..

భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పార్ట్‌టైం అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు పీహెచ్‌డీ, నెట్, సెట్ పట్టాలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయమైన తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించేంత వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవు

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో నీటి సరఫరాలో డబ్బులు డిమాండ్ చేయ్యడం పట్ల శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన పైసల్ కొట్టు నీళ్ల పట్టు అనే కథనానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి స్పందించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వార్డు అధికారులు, వాల్ ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 49 వార్డులలో తాగునీటి సమస్య రావోద్దని, ఎక్కడా సమస్య ఉన్న ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. ప్రజలకు నీటి సరఫరా చేసే సమయంలో డబ్బులు వసూళ్ల చేయరాదని ఒకవేళ అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వార్డు ఆఫీసర్లు తమ వార్డుల్లో నీటి అవ సరాలపై ఎప్పటికప్పుడు పర్యావేక్షణ చేయాలని సూచించారు. ఏ వార్డులో నీటి సమస్య ఉందని ఫిర్యాదు వచ్చిన ఆ వార్డు అధికారే బాధ్యత వహించాల్సి ఉం టుందని తెలిపారు. సామాన్య ప్రజలకు ఎలా నీటి సరఫరా చేస్తున్నామో మాజీ ప్రజాప్రతినిధులకు, రాజకీయ నాయకులకు, అధికారులకు సైతం అలా నే నీటిని సరఫరా చేయాలని తెలిపారు. అలా కాదని వారి సంపుల్లో నీటిని పోస్తున్నవారిపై కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.



శిక్షణలో పాల్గొన్న బాలికలు



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ

ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకే ఫ్రీ సమ్మర్ క్యాంప్

● సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకే ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు వారం రోజుల పాటు ఆర్మూర్ రోడ్‌లోని ఆర్‌బీవీఆర్ఆర్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిబిరాన్ని శుక్రవారం సీపీ సాయిచైతన్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని చదువులకు సమ్మర్ క్యాంప్‌లకు చాలా తేడా ఉంటుందని ఈ క్యాంప్ ముఖ్య ఉద్ధేశం విద్యార్థినులు ఎలా ఉండాలి.. ఎలా చదువు కోవాలి.. ఎలా భవిష్యత్తులో ముందుకెళ్లాలి.. ఏదైనా సమస్య ఉంటే ఎలా ఎదుర్కోవాలి అనే ప్రతీ ఒక్క అంశంపై క్లుప్తంగా బాలికలకు వివరించడం జరుగుతుందన్నారు. విద్యార్థినులకు ముఖ్యంగా ఆడపిల్లలకు ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందించడం, నేరాల పట్ల అవగాహన కల్పించడం శిబిరంలో వారు తమకు తాము రక్షిం చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను, ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై శిక్షణ పొందుతారని అన్నారు. ఈ శిబిరం విద్యార్థులలో ఆత్మస్థైర్యం పెంచుతుందని వారు సమాజంలో ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో జీవించగలిగేలా చేస్తుందన్నారు. శిబిరంలో విద్యార్థినులకు నేరాల నుంచి ఎలా దూరంగా ఉండాలో వాటిని ఎలా ఎదుర్కో వచ్చో తెలియజేస్తామన్నారు. శిబిరంలో మహిళలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించడంతో పాటు ఎలా నేరాల నుంచి రక్షించుకోవచ్చో, ఆత్మస్థైర్యంతో ఎలా బతకాలో నేర్పుతామన్నారు. ఈ శిబిరంలో సెల్ఫ్ మోటివేషన్ తరగతులు ఉంటాయని ఈ శిబిరానికి వచ్చిన విద్యార్థినులకు ప్రోత్సహిస్తున్న తలిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. మొదట ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు తైక్వాండో ట్రైనర్ మనోజ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలకు, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో తమను తాము రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేసుకోవాలో శిక్షణ ఇచ్చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ విశాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ మోజులో పడి యువత ఎలా చెడు దారులు పడుతున్నారో, ఎలా వ్యసనాలకు అలవాటు పడుతున్నారో వివరించారు. మోటివేషనల్ స్పీకర్ శ్రీహరి మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు ఎలా ఉండాలో మెలకువలు నేర్పించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు రేపటి వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సాయి కిరణ్, సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, యోగా మాస్టర్ కిషన్, తైక్వాండో ట్రైనర్ మనోజ్, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు

ఎల్లారెడ్డిరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి దాదాపు 15 రోజులు గడుస్తున్నా ఇంకా ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సన్నవరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తుందని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతుల సంఖ్య మరింత పెరుగుతుంది. కాని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ చాలా చోట్ల మొదలుకాకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామంలో ఇటీవల కొనుగోలు కేంద్రం ప్రారంభించి రోజులు గడుస్తున్నా ఇంకా కొనుగోలు ప్రక్రియ కొనసాగకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో అన్నసాగర్, వెల్లుట్లపేట, ఆజామాబాద్ తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోలులో జాప్యం చేస్తున్నారని రైతులుపేర్కొంటున్నారు. మార్కెట్‌లో ప్రైవేట్ మిల్లర్లు, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలుచేస్తున్నారని, రైతులు ప్రభు త్వ కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. కాని ఇక్కడ రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఎండవాన లెక్కచేయకుండా కాపాల ఉండాల్సి పరిస్థితి ఎదురవుతుంది. మిశ్రమ వాతావరణంతో రైతుల్లో ఆందోళన నెలకొంటుంది. ఐకేపీ సిబ్బంది మాత్రం హమా లీల కొరత వల్ల ఆలస్యం అవుతుందని సమాధానం చెబుతున్నా ర ని ఇలా అయితే అకాలవర్షాలు పడి ధాన్యం తడిసిపోతే మా పరి స్థితి ఎంటని ప్రశ్నిస్తున్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబెడుతున్న రైతులు

కొనుగోలు మాత్రం చేపట్టడం లేదు

● శ్రీనివాస్‌రెడ్డి, రైతు



కొనుగోలు కేంద్రం త్వరగా ప్రారంభించడంతో త్వరగా ధాన్యం అవుతుందని ఆశించాం. కాని ఇంకా హమాలీలు లేరని అధికారులు చెబుతుండడంతో నిరాశకు గురవుతున్నాం. అకాల వర్షాలు పడుతుండడంతో ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.

అంగరంగ వైభవంగా హనుమాన్ కల్యాణ మహోత్సవం

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్‌కాలనీలో గల శ్రీశ్రీశ్రీ ఇష్ట కార్యసిద్ది అంజనేయ స్వామి దేవాలయంలో సువర్చల సహిత హనుమాన్ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు అందించి, హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికి అభిషేకం, హోమం, అలంకరణ, అర్చన, హారతి, తీర్థ ప్రసాద స్వీకరణ, పల్లకిసేవ భజన కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కందకుర్తిలో హనుమాన్ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

రెంజల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం నది ఒడ్డున ఉన్న సీతారాం ధాం సంత్ ఆశ్రమంలో మే 19 నుంచి 27వ తేదీ వరకు చండీయాగం, భగవద్గీత కార్యక్రమాల నిర్వహణ కొరకు యజ్ఞ యాగాలు నిర్వహించడం కోసం శుక్రవారం అయోధ్య సీతారాం త్యాగి మహరాజ్ ఆధ్వర్యంలో హనుమాన్ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందకుర్తి గ్రామస్థులు రమేష్, యోగేష్, గోవింద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న సీతారాం త్యాగి మహరాజ్



సివిల్ ర్యాంకర్‌ను అభినందిస్తున్న సీపీ

సివిల్ ర్యాంకర్‌ను అభినందించిన సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాలలో జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ జె.గోవింద్ రావు కుమారుడు జె.సాయిచైతన్య యూపీఎస్సీలో 68వ ర్యాంకు సాధించడంతో శుక్రవారం సీపీ సాయిచైతన్య హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు సివిల్ ర్యాంకర్‌ను అభినందించారు. పోలీస్ క్యాంప్ కార్యాలయంలో సివిల్ ర్యాంకర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన తండ్రి హెడ్‌కానిస్టేబుల్‌ను కూడా అభినందించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ తమ పిల్లలను చక్కని చదువులు చదివించి ఉన్నతస్థాయి అధికారులను చేయడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది ప్రతీ ఒక్కరు తమ పిల్లలను ఉన్నతస్థాయి చదువులు చదివించి భవిష్యత్తును చక్కని మార్గంలో పెట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ మల్లేష్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, తిరుపతి, పోలీస్ అసోసియేషన్ ప్రసిడెంట్ షకీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులను పరుగులు పెట్టించిన ఈదురు గాలులు



దోమకొండ, ఏప్రిల్ 25(ఆంధజ్యోతి): దోమకొండ మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు పడడంతో రైతులు దాన్యం కుప్పలపై టార్పాలిన్‌లు కప్పి ఉంచారు. ఈదరుగాలులకు కవర్లు కొట్టుకపోకుండా వాటిపై రాళ్లు పెట్టారు. గొట్టిముక్కుల గ్రామంలోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో సుమారు గంట పాటు ఈదురు గాలులు వీచాయి. దీంతో రైతులు పరుగులు పేడుతూ తమ వరి ధాన్యాన్ని రాశులు చేసి తార్పాలిన్ కవర్లు కప్పి ఉంచారు.

మలేరియా వ్యాధిపై అవగాహన



డోంగ్లిలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

మద్నూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మలేరియా అంటేనే వణికిపోయేవారు ఏ చిన్న జ్వరం వచ్చిన వైద్యులు ముందుగా మలేరియా టెస్టు చేసేవారు. అందులో నెగిటివ్ ఉందంటే సరే పాజిటివ్ వచ్చిందంటే ఇక హడలే కొద్దిపాటి నిర్లక్ష్యం వహించిన ప్రాణాలకే ముప్పు ఉండేది కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందని డోంగ్లి పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మలేరియా వ్యతిరేక దినం పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకోవడంతో మలేరియా తగ్గుముఖం పట్టిందని అన్నారు. అనఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సోకుతుందని జ్వరం, నీరసం, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది స్వల్ప ఇన్ఫెక్షన్లు ఈ వ్యాధి లక్షణాలని గుర్తు చేశారు. మలేరియా వ్యాధి ప్రధానంగా నవంబర్, డిసెంబర్, జనవరి నెలలో ప్రధానంగా ఉంటుందని ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణీలు, హెచ్‌ఐవీ ఎయిడ్స్ బాధితులకు వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. మురికి నీళ్ల నిలువ ఉండే ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సు మంజుల, ఏఎన్ఎం నాగమణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాల పరిశీలన

రామారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో శుక్రవారం రైతు కల్లల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయం తెలుసుకోవడం జరిగింది. వారు బోనస్ వలన చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. గతంలో సన్న వడ్లకు రూ.500 బోనస్ రావడం జరిగిందని, ఈ సారి కూడా వస్తుందని ఆశిస్తున్నామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రావు, పోసానిపేట్ గ్రామ మాజీ సర్పంచ్, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం

రామారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా వ్యతిరేక దినంను శుక్రవారం పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సురేష్ మలేరియా వ్యాధుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పద్ధతులు, సలహాలు, సూచనలను పాటించాలని కోరారు. మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. దోమలు పెరగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి కోరారు. దోమల వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భీం, సిబ్బ ంది రమ్య, ఫార్మసిస్టు రాజు, ల్యాబ్ టెక్నీషియన్ పవన్, స్టాఫ్ నర్సు రేణుకా, ఏఎన్ఎంలు, మంజుల,లలిత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

భిక్కనూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంసస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీరాం వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో యూత్‌కాంగ్రెస్ మండలస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రభుత్వం చేపడుతున్న పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అధికసంఖ్యలో గెలిపించుకోవాలని అన్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసంలో అర్హులకు లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిబద్ధత, అంకిత భావంతో పని చేయాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో తపాస్ ఆధ్వర్యంలో అహల్యాభాయ్ హోల్కర్ త్రిశతాబ్ది జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తపాస్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు హన్మంత్‌రావు, నవాత్ సురేష్, జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, ఏబీఆర్‌ఎస్ఎమ్ ప్రభారి పాలేటి వెంకట్‌రావు, రాష్ట్ర బాధ్యులు రవీంద్రనాథ్, రమేష్‌కుమార్, భాస్కరాచారి, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుళ్లకు రివార్డు అందిస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

మహిళలు షీటీంలను సంప్రదించాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీటీంలను సంప్రదించాలని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. శుక్రవారం షీటీం కానిస్టేబుల్‌లు సౌజన్య, ప్రవీణలను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్‌టచ్- బ్యాడ్ టచ్ లాంటి కీలక అంశాలపై అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తు,విద్యార్థులకు సరైన మార్గదర్శనం అందించినందుకు క్యాష్ రివార్డు అందించడం జరిగిందని తెలిపారు. షీటీం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు కొత్తచట్టాలపై సమాచారం ఇవ్వడమేకాక,వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమైన కౌన్సిలింగ్ అందిస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రజలు 8712686094 నంబర్‌కు సంప్రదిస్తే షీటీం స్పందిస్తుందని తెలిపారు.



అంబులెన్స్‌లో శిశువుకు పురుడు పోసిన సిబ్బంది

108 అంబులెన్స్‌లో ప్రసవం

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన కవితకు గురువారం సాయంత్రం అంబులెన్స్‌లో పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో పెద్ద కొడప్‌గల్ అంబులెన్స్ కాటేపల్లి గ్రామానికి చేరుకుని కవితను ప్రసవం నిమిత్తం పిట్లం ఆసుపత్రికి తరలించారు. అక్కడ కవితకు పరీక్షించిన వైద్య సిబ్బంది కడుపులోపల ఉన్న బిడ్డకు ఇబ్బంది ఉందని మెరుగైన చికిత్స కోసం బాన్స్‌వాడ ఆసుపత్రికి తరలించాలని తెలపడంతో 108 సిబ్బంది కవితను బాన్స్‌వాడ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కవితకు 108 సిబ్బంది పురుడుపోసి ప్రసవం చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. కవితకు క్షేమంగా పురుడుపోసిన 108 సిబ్బంది గంగరాం, పైలట్ వెంకటేష్‌కు కవిత బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బపై అవగాహన సదస్సు

బీర్కూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో మహబూబ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో వడదెబ్బపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాతావరణంలో మార్పులు మానవునిపై ప్రభావం అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులకు సీహెచ్ఓ రవీందర్ అవగాహన కల్పించారు. వడదెబ్బ లక్షణాలు, కాపాడుకునే మార్గాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్, వైద్యాధికారి నాగ గిరీష్, సుధాకర్, సబ్ యూనిట్ అధికారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిలో మరణించిన వారికి ఘన నివాళి

భిక్కనూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి భిక్కనూరు టోల్‌ప్లాజా సిబ్బంది శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా వద్ద రెండు నిమిషాల పాటు మౌనం పాటించి మృతి చెందిన వారి చిత్రటాలను పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం టోల్ మేనేజర్ ప్రకాష్ మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన వారికి దేవం అండగా ఉంటుందని, ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్లాం టెర్రరిజాన్ని ప్రోత్సహించొద్దు

లింగంపేట: ఇస్లాం టెర్రరిజాన్ని ప్రోత్సహించొద్దని జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని యావత్ ముస్లిం సమాజం ఖండిస్తుందని ఖద్రియా మస్జీద్ ఇమామ్ వజీర్ బేగ్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలోని ఖద్రీయా మస్జీద్‌లో సమూహిక ప్రార్థనల సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కాశ్మీర్‌లో జరిగిన ముష్కర దాడి పిరికి పందల చర్య అని ఇస్లాం శాంతి, సోదర స్వభావం, సమానత్వాలను బోధిస్తుందని ఆయన తెలియజేశారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ప్రభుత్వం హతమార్చలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మత పెద్దలు అబ్దుల్ ఖదీర్, వాహాబ్, ఫారూక్, ఇబ్రహీంలతో పాటు మండలలోని ముస్లింలు ఉన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

కామారెడ్డి టౌన్: ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద పాఠకులతో కలిసి ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహల్గావ్‌లో పర్యటకులపై కాల్పులు జరిపి హత్యకాండ సృష్టించిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఆ ఉగ్రవాదులు వెనుక ఎవరు ఉన్న విడిచిపెట్టవద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది మౌనిక,కపిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల ఉనికి లేకుండా చేయాలి

సదాశివనగర్: ఉగ్రవాదుల ఉనికి లేకుండా చేయాలని సీడీసీ చైర్మన్, మైనార్టీ నాయకుడు ఇర్షాదుద్దిన్ అన్నారు. కాశ్మీర్ పహల్గావ్‌లో పర్యటకులపై ఉగ్రవాదులు విచక్షణ రహితంగా చేసిన దాడిని ఖండిస్తున్నామని అన్నారు. మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకురాలని అడ్లూర్‌ఎల్లారెడ్డిలో ముస్లింమైనార్టీలు మసిద్ నుండి గాంధీచౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించామని తెలిపారు. కులమతాలకతీతంగా అన్నదమ్ముల్లా కలిసి ఉన్న భారతదేశంలో పాకిస్తాని గుండాలు చేతగాని దద్దమ్మల భారత్‌పై దాడులు నిర్వహించడం సహించరాని నేరమన్నారు. దోషులను సత్వరమే గుర్తించి కఠినంగా శిక్షించాలని తెలిపారు.

బీబీపేట: బీబీపేట జామమసీద్‌లో శుక్రవారం నమాజ్ చేసిన అనంతరం ముస్లింలు పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిపై నల్లబ్యాడ్జీలు కట్టి నిరసన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని ఇస్లాం ఎన్నటికి అంగికరించదని మతం పేరుతో మరణహోమం సృష్టించడం తగదని అన్నారు. 27 మంది చనిపోవడం బాధకరమని వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామని తెలిపారు. మరణహోమానికి కారకులైన ఉగ్రవాదులను నడిరోడ్డులో కాల్చిచంపాలని ఇండియావైపు చూడా లంటేనే ఉగ్రవాదులకు భయం కలిగేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

బిచ్కుంద: ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా శుక్రవారం బిచ్కుందలో ముస్లింలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జిలతో నమాజ్‌కు వెళ్లి చనిపోయిన వారికి నివాళ్లు అర్పించి వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థంచారు. మన దేశశాంతి, ఏకత్వాన్ని బలహీనపరచడానికి విదేశీ శక్తులు, ఉగ్రవాదులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. మనమందరం ఏకమై విదేశీ శక్తులకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మదినా మజీద్ అధ్యక్షుడు ముఖిద్, అబ్రార్, గఫార్, మసూద్, షేక్ హుస్సేన్,ఇర్షాద్‌అలీ, సత్తార్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలో శుక్రవారం పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన మృతులకు స్థానికులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాద ఫ్యాక్టరీగా మారిందని, పాక్‌ను తుదముట్టించాలని యువకులు భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులు యాత్రికుల మతం తెలుసుకుని హిందువులను గుర్తించాకే హత్య చేశారని, ఇలాంటి రాక్షసులను అంతం చేయాలన్నారు. ప్రపంచ పటంలో పాకిస్తాన్ దేశం నక్ష లేకుండా సర్వ నాశనం చేయాలన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఉగ్రదాడులు జరిగినా పాకిస్తాన్ హస్తం ఉంటుందన్నారు. ప్రపంచ దేశాలన్నీ కలిసి పాకిస్తాన్‌ను మట్టికరిపిస్తే ప్రపంచంలో ఉగ్రవాదం సమూలంగా అంతమవుతుందన్నారు.



భిక్కనూరు టోల్ ప్లాజాలో నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం



కామారెడ్డిలో..



గాంధీచౌరస్తాలో..



బిచ్కుందలో..



బీబీపేటలో..

అప్పు చెల్లించలేదన్న కక్షతో ధాన్యం కుప్పను తగలబెట్టిన అల్లుడు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బులను తన మామ సకాలంలో చెల్లించలేదన్న కక్షతో సొంత అల్లుడు మామ టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని, వరి ధాన్యం కుప్పకు నిప్పు పెట్టి తగలబెట్టిన ఘటన నాగిరెడ్డిపేట మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాసంపల్లి గ్రామానికి చెందిన చాకలి బాలమణి సాయిలు అనే దంపతులు తమ బిడ్డనిచ్చిన అల్లుడు మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన బాలకృష్ణ కుటుంబం వద్ద రెండు లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. అప్పుగా తీసుకున్న డబ్బులను సకాలంలో చెల్లించినందుకు తన భార్యను మామ ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. అనంతరం ఈనెల 23న తన భార్యను తీసుకొని వెళ్లాడని తెలిపారు. మామ తీసుకున్న డబ్బులను చెల్లించనందుకు ఇట్టి విషయాన్ని మనసులో పెట్టుకున్న అల్లుడైన బాలకృష్ణ గురువారం రాత్రి చాకలి సాయిలు ఇంటి ముందున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనానికి నిప్పు పెట్టి దగ్ధం చేశాడని తెలిపారు. అలాగే ఊరి శివారులో ఉన్న ధాన్యం కుప్పకు కూడా నిప్పట్టించాడని తెలిపారు. జరిగిన ఘటనపై చాకలి సాయిలు భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.



ధాన్యం కుప్పకు నిప్పు పెట్టిన దృశ్యం



బీర్కూర్ ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

బీర్కూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. 1999-2000 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరూ కలుసుకున్నారు. 25 ఏళ్ల అనంతరం తమ క్లాస్ మెట్లను కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఏరా, ఒరేయ్‌లతో పాటు ఆనాటి నిక్ నేమ్‌లతో పిలుస్తూ ఆట పట్టించారు. చదువుకునేటప్పుడు చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆట,పాటలతో సందడి చేశారు. కుటుంబ సమేతంగా హాజరయ్యారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాడు చదువుకున్న తరగతి గదులను, క్లాస్ రూమ్‌లలో ఎక్కడెక్కడ కూర్చునే వారో గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. స్టేజీపై ఒక్కొక్కరుగా వచ్చి తమ కుటుంబ సభ్యులను క్లాస్ మెట్లకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమం ఆసాంతం ఆనందోత్సవాల మధ్య కొనసాగింది.

రవాణా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● డిపో మేనేజర్ సరితా దేవి

నిజాంసాగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ డిపో నుంచి నూతనంగా ప్రవేశపెట్టిన శంకరంపేట ఎల్లారెడ్డి బస్సు సౌకర్యాన్ని డిపో అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఉదయం బాన్సువాడ నుండి బయ లుదేరి ఎల్లారెడ్డి చేరుకొని ఎల్లారెడ్డి నుండి నిజాంసాగర్ మీదుగా మెదక్ జిల్లా శంకరంపేట్‌కు వెళుతూ ఉందని అధికారులు తెలిపారు. ఈ బస్సు సర్వీసు ప్రతిరోజు మూడుసార్లు ఎల్లారెడ్డి శంకరంపేటలకు తిరుగుతూ సాయంత్రం పిట్లం మీదుగా బాన్సువాడ చేరుకుంటుందని డిపో మేనేజర్ సరళ దేవి తెలిపారు. ఎల్లారెడ్డి శంకరంపేటలకు ఆర్డినరీ బస్సు సర్వీస్ లేకపోవడంతో ఈ బస్సు సర్వీసులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ బస్సును ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు శంకరంపేట ఎల్లారెడ్డి ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లారెడ్డి-శంకరంపేటలకు ప్రారంభమైన బస్సు

పౌష్టికాహారంతోనే.. పుట్టబోయే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా డీడబ్ల్యూవో ప్రమీల

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే గర్భిణీకి పుట్టబోయే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం అని జిల్లా డీడబ్ల్యూవో ప్రమీల అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి ఐసీడీఎస్ సీడీపీవో ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బాలా గౌడ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పమీల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెలలో పోషణ పక్షం కార్యక్రమాలు ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నామని పోషణ పక్షంలో పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అలాగే గర్భం దాల్చిన నుంచి బిడ్డకు రెండేళ్ల వయసు వచ్చేవరకు పోషకాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రసవమైన తర్వాత పిల్లలకు పుట్టిన పిల్లలకు ముర్రు పాల ప్రాముఖ్యత గురించి గర్భిణీ బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు. పిల్లలకు ఇచ్చే బాలామృతం సీజనల్ ఫుడ్ అందించాలని, అనంతరం బాలింతలకు శ్రీమంతాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసం తదితర వంటి కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ స్వరూప రాణి, భారతి ,హారతి, వినోదిని, లలితా, ఈశ్వరి, సీనియర్ అసిస్టెంట్ మహిపాల్, రవి, అంగన్వాడీ టీచర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సహాయం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలం రేపల్లెవాడకు చెందిన కుమ్మరి పెద్ద నాగయ్య గుడిసె ఇటీవలే గ్యాస్ సిలిండర్ పేలడంతో అగ్ని ప్రమాదం జరిగి సర్వం కాలి బూడిదైన విషయం పాఠకులకు విధితమే. శుక్రవారం విషయం తెలిసిన ఎల్లారెడ్డి మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, బాధితుని కుటుంబాన్ని పరామర్శించి ఐదు వేల ఆర్థిక సహాయం అందజేశారు.

వరంగల్ మహాసభను విజయవంతం చేయాలి

● మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి

నిజాంసాగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని నిజాంసాగర్ మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో టిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శ్రేణులకు పార్టీ జెండాలతో పాటు కండువాలను వాల్ పోస్టర్లను పంపించేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసాగర్ మండలం నుండి అధిక సంఖ్యలో వరంగల్ సభకు తరలి వెళ్లాలని ఆయన తెలిపారు. ప్రతి గ్రామం నుండి ప్రతి ఒక్క కార్యకర్త నడుం బిగించి వరంగల్ సభకు తరలివెళ్లి అధికార పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ఎండ కట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా తూకం ప్రారంభించాలి

మహమ్మద్ నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):మహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గేటువద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఓ పీడీ సురేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరిధాన్యం కొనుగోలు చేయాలని ఐకేపీ ఏపీఎంలకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు చేయడానికి కూలీల కొరతతో ధాన్యం కుప్పలుగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. రెండురోజుల్లో తూకం ప్రారంభించి లారీల కొరత లేకుండా చూస్తామని అన్నారు. ఆయన వెంట డీపీఎం రమేష్‌బాబు, సుధాకర్, ఐకేపీ ఏపీఎం రామనారాయణగౌడ్, సీసీసాయిలు రైతులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల స్థలాల పరిశీలన

బీబీపేట,ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పురాతన ఇళ్లను, ఇంటి స్థలాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇండ్ల నిర్మాణానికి రెండోదపా లబ్దిదారుల వివరానలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులో నాలుగు విడుతలుగా రూ.5లక్షలను ప్రభుత్వం మంజూరు చేయడానికి నెలకొల్పిన ప్రక్రియ అంతా పకడ్బందిగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రంలో గ్రామ కార్యదర్శులు వెన్నెల, శ్రీనివాస్, భరత్,వెంకటస్వామి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు గుంతలో పడి బాలుడి మృతి

మాచారెడ్డి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చెరువు నుంచి రోడ్ల పనుల కోసం గుంతలు తవ్వడంతో ఆ గుంతలో బాలుడు పడి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన సంఘటన పాల్వంచమండలం భవానిపేట గ్రామంలో చోటు చేసుకుంది. రామారెడ్డి మండల కేంద్రంకు చెందిన దండబోయిన అశోక్ కుటుంబసభ్యులతో కలిసి భవానిపేట ఎల్లమ్మ ఆలయ దర్శనంతో పాటు బంధువులు విందుకు హాజరయ్యాడు. దైవదర్శనం చేసుకుని భోజనం చేసిన తర్వాత ఆయన కుమారుడు రిత్విక్‌రాజ్(4) ఆలయం వెనుకభాగంలో ఉన్న చెరువులో తీసిన గుంతలో పడి శవమై కనిపించాడు. కుమారుడు భోజనం చేసిన తర్వాత కనిపించడం లేదని చుట్టుపక్కల వెతకడంతో కుంటలో శవమై కనిపించాడు. చెరువులో రోడ్డు పనుల కోసం మొరం తవ్వకాలు చేపట్టడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయని దీనిపైగ్రామస్తులు అధికారులకు ఫిర్యాదుచేసిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీరికి గ్రామస్తులు అండగా నిలవడంతో సంఘటన స్థలానికి ఎస్‌ఐ అనిల్ చేరుకున్నారు. ఆందోళన చేస్తున్నవారిని ఎస్‌ఐ గ్రామస్తులను, కుటుంబసభ్యులను సముదాయించారు.

కరెంట్ షాక్‌తో దున్నపోతు మృత్యువాత

రామారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం జగదాంబ తండాకు చెందిన గంగావతి జగ్గారం రైతు పొలంలో దున్నపోతు మేత మేస్తుండగా విద్యుత్ తీగ తాకి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సందర్భంగా కరెంట్ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం కేటాయించిన డబ్బులను త్వరగా రైతుకు అప్పగించినట్లు కరెంటు అధికారులు వివరించారు.

గొల్లపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రామారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం పాడి పశువులన్నింటికీ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశువైద్య, పశుసంవర్థక అధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదని పాడి రైతులందరూ ఈ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలని పలు సలహాలు, సూచనలు, పద్దతులను సూచించారు. ఈ వ్యాధికి నివారణ టీకానే మార్గమని సూచించారు. ప్రభుత్వం ఖరీదైన ఈ టీకాను ఉచితంగా అందిస్తుందని పాడి రైతులందరూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పాడిపశువులన్నింటికీ టీకాలు ఇప్పించుకొవాలని తెలిపారు. అనంతరం మండల పశు వైద్య అధికారి డాక్టర్ రాంచందర్ మాట్లాడుతూ శిబిరంలో మొత్తం 148 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని, 35 మంది పాడి రైతులు లబ్ది పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌వో శ్రీనివాస్ రావు, జేవీవో నారాయణ, పశు వైద్య సహాయకుడు రమేష్, దశరథ్, ఆంజనేయులు, బాలమణి, రైతులు మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి న్యాయాధికారిగా సుష్మ నియామకం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయాధికారిగా సుష్మ మదమంచిని నియమిస్తూ శుక్రవారం హైకోర్టు ఆదేశాలు చేసింది. గతంలో పని చేసిన జూనియర్ సివిల్ జడ్జి హారిక బదిలీ కాగా ఆ స్థానంలో సుష్మను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్	- జిమ్ ఖానా
ప్రియా 70	- అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
ప్రియా 35	- సారంగాపాని జాతకం

బాన్సువాడ

మహేశ్వరి	- ఓదెల 2
వెంకటేశ్వర	- ఒక్కడు



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

